క్లుప్తంగా

రేపు మంత్రి పర్యటన



శాయంపేట : రాష్ట్ర గిరిజన, శిశు సంక్షేమశాఖ మంత్రి సత్యవతి రాథోడ్ ఆదివారం మండలంలో పర్యటించనున్నట్లు ఎంపీపీ తిరుపతిరెడ్డి తెలిపారు. మండలంలోని వివిధ గ్రామాల్లో రూ. 25కోట్ల నిధులతో చేపట్టనున్న పనులకు శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణా రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ గండ్ర జ్యోతి హాజరు కానున్నట్లు పేర్కొన్నారు. మండలంలోని ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు, కార్యకర్తలు, ప్రజలు తరలిరావాలని పిలుపునిచ్చారు.

'కడియం'ను కలిసిన గ్రామస్తులు



ధర్మసాగర్: మండలంలోని పెద్దపెండ్యాల గ్రామస్తులు శుక్రవారం స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి, ఎమ్మెల్సీ కడియం శ్రీహరిని హనుమకొండలోని ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందించి పలు అంశాలపై చర్చించారు. ఎంపీటీసీ నిమ్మ కవిత, సర్పంచ్ ఆకారపు అన్నమ్మ, ప్రజా ప్రతినిధులు, పద్మశాలి సంఘం నాయకులు, బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు, సోషల్ మీడియా వారియర్స్ తదితరులు కలిసిన ఉన్నారు.

సెల్‌ఫోన్ అప్పగింత



దామెర: పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను ట్రేస్ చేసిన పోలీస్ శుక్రవారం బాధితుడికి అందించారు. ఎస్సై ముత్యం రాజేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని వెంకటాపూర్‌కు చెందిన ఉప్పుల ఆకాష్ 15 రోజుల క్రితం తన ఇంటి సమీపంలో తన సెల్‌ఫోన్‌ను పోగొట్టుకున్నాడు. ఈ విషయమై బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో నూతనంగా అందుబాటులోకి వచ్చిన సీఈఐఆర్ సాఫ్ట్‌వేర్ సాయంతో పోలీసులు సెల్‌ఫోన్ లొకేషన్‌ను ట్రేస్ చేసి సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకుని ఆకాష్‌కు అప్పగించారు. తన సెల్‌ఫోను అప్పగించిన ఎస్సై రాజేందర్, సిబ్బందికి బాధితుడు కృతజ్ఞతలు తెలిపారు.

ఎంపీపీ జన్మదిన వేడుకలు

శాయంపేట : స్థానిక ఎంపీపీ మెతుకు తిరుపతిరెడ్డి జన్మదినాన్ని శుక్రవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాయలంలో ఘనంగా నిర్వహించారు. ఎంపీపీ కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు శాలువాలతో సన్మానించారు. మండల వర్కింగ్ ప్రెసిడెంట్ గుర్రం అశోక్, మండల అధ్యక్షులు మనోహర్‌రెడ్డి, అశోక్, రమణారెడ్డి, సాంబయ్య, తిరుపతిరెడ్డి, సుమన్, రాజేందర్, తిరుపతి, మల్లయ్య, శంకరాచారి, రవీందర్ పాల్గొన్నారు.

మేరీ మిట్టి మేరా దేశ్



పరకాల: ఆజాదీకా అమృతోత్సవ్‌లో భాగంగా తెలంగాణ పోరాట యోధులు, స్వాతంత్ర్య సమరయోధుల ఇంటి నుంచి మట్టిని పోస్టల్ శాఖ ఆధ్వర్యంలో సేకరించారు. ఈ సందర్భంగా అమరధామంలో స్వాతంత్ర్య సమరయోధుడు వీరగంటి చిన్న కొమురయ్యను పోస్టల్ శాఖా అధికారులు, ఉద్యోగులు సన్మానించారు. సబ్ డివిజన్ పోస్టల్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ అనంతరామ్ నాయక్, పోస్టుమాస్టర్ మొగిలి, శశికిరణ్, సిబ్బంది పాల్గొన్నారు.

పరామర్శ

ఆత్మకూరు: మండలంలోని పెద్దాపూర్ గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన కాటబత్తిని రాజశేఖర్ కుటుంబాన్ని స్థానిక సర్పంచ్ సావురే కమలరాజేశ్వర్‌రావు శుక్రవారం పరామర్శించారు. బాధిత కుటుంబ సభ్యులను ఓదార్చి ఆర్థిక సాయం అందించారు. బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి బొల్లోజు కుమారస్వామి, ఉపసర్పంచ్ వనమాలసుధాకర్‌గౌడ్, నాయకులు సాంబయ్య, అశోక్, కృష్ణమూర్తి, గణేష్ ఉన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ: హనుమకొండలోని పలు ప్రాంతాల్లో ఈనెల 30వ తేదీన విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని టీఎస్ ఎన్పీడీసీఎల్ హనుమకొండ టౌన్ డీఈ జీ.సాంబరెడ్డి తెలిపారు. వడ్డెపల్లి చర్చి, పరిమల కాలనీ, ఆర్టీసీ కాలనీ, సప్తగిరి కాలనీ, పూరిగుట్ట, పోలీసు కాలనీ ప్రాంతాల్లో ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

గర్భిణులు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి



దామెర : ప్రతిజ్ఞ చేస్తున్న గర్భిణులు, బాలింతలు ఐసీడీఎస్ సిబ్బంది



పరకాల : గర్భిణికి సీమంతం చేస్తున్న చైర్‌పర్సన్, తదితరులు

దామెర: మండలంలోని గర్భిణులు ఆర్యోగంపై శ్రద్ధ వహించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పద్మావతి సూచించారు. పోషణ్‌మాసం కార్యక్రమంలో భాగంగా మండలంలోని దుర్గంపేట్‌లో శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించి ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడూ.. గర్భిణులు, బాలింతలు, కిషోర బాలికలు అధిక పోషక విలువలు కలిగిన ఆహారం తీసుకోవాలన్నారు. అంగన్‌వాడీ సిబ్బంది సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనారోగ్య సమస్య తలెత్తితే వెంటనే ఏఎన్ఎం, ఆశ వర్కర్, అంగన్‌వాడీ సిబ్బందికి సమాచారం ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పురాణం రాజేశ్వరిఈశ్వర్, అంగన్‌వాడీ సిబ్బంది, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పరకాల: పోషక ఆహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని మున్సిపల్ చైర్‌పర్సన్ సోదా అనిత రామకృష్ణ అన్నారు. జాతీయ పోషణ్‌మాసాన్ని పురస్కరించుకొని ఐసీడీఎస్ ఆధ్వర్యంలో 14వ వార్డులోని వెలమవాడ అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులకు సీమంతాలు నిర్వహించారు. పిల్లల తల్లులు, గర్భిణులకు పోషకాహారంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణులు పోషకారాహారం తీసుకుంటేనే పుట్టబోయే బిడ్డ ఆరోగ్యంగా జన్మనిస్తారని అన్నారు. ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలని, వైద్యుల సలహాలు, సూచనలు పాటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్ వైజర్ భాగ్యలక్ష్మి, కౌన్సిలర్లు మార్క ఉమాదేవి, శనిగరపు రజని, చందుపట్ల సుజాత, అంగన్‌వాడీలు, ఉపాధ్యాయులు కవిత, రజిత, సునంద, మాధవి, కరుణ, అరుణ పాల్గొన్నారు.

కమీషన్ల కోసమే కాంప్లెక్స్‌ల నిర్మాణం

పరకాల: కాంట్రాక్టర్ల నుంచి కమీషన్‌లు వసూలు చేసేందుకే ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి అనుమతులు లేకుండా కాంప్లెక్స్‌ల నిర్మాణాలు చేపడుతూ ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారని మాజీ ఎమ్మెల్యే మొలుగూరి భిక్షపతి ఆరోపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తహసీల్దార్ కార్యాలయం రోడ్డులోని రెవెన్యూ శాఖకు సబంధించిన స్థలంలో మున్సిపల్‌శాఖ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణంపై అభ్యంతరం తెలుపుతూ రెవెన్యూ అధికారులు సంబంధిత కాంట్రాక్టర్‌కు నోటీసులు జారీ చేసినట్లు తెలిసిందన్నారు. ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డికి అభివృద్ధి పనుల కంటే భవనాల నిర్మాణంపై ఎక్కువ చిత్తశుద్ధి ఉందని ఆరోపించారు. భవనాలు, కాంప్లెక్స్‌లు నిర్మాణం చేయడం వలన కాంట్రాక్టర్ల నుంచి కమీషన్‌లు తీసుకోవచ్చనే ఆలోచన మానుకోవాలని, ప్రజల సమస్యలపై పట్టించుకోవాలని విమర్శించారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులతో కలిసి కాంప్లెక్స్ నిర్మాణ ప్రదేశాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు మార్త భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.



కాంప్లెక్స్‌ను పరిశీలిస్తున్న బీజేపీ నాయకులు

బ్లేడుతో వ్యక్తిపై దాడి



గాయపడిన మనోహర్

ఎల్కతుర్తి: పాత కక్షలతో ఓ వ్యక్తిపై మరోవ్యక్తి బ్లేడుతో దాడి చేసి గాయపర్చాడు. ఈ సంఘటన మండలంలోని దామెరలో చోటుచేసుకుంది. ఎస్సై రాజ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం .. దామెర గ్రామానికి చెందిన మంతుర్తి మనోహర్ అదే గ్రామానికి చెందిన మంతుర్తి దేవరాజ్‌లకు పాత కక్షలు ఉన్నావి. వాటిని దృష్టిలో ఉంచుకున్న దేవరాజ్ కక్ష తీర్చుకోవాలన్నాడు. ఈ క్రమంలో గురువారం సాయంత్రం వినాయక నిమజ్జనం శోభాయాత్ర తిలకించి ఇంటికి వెళ్తుండగా మసీదు సమీపంలో దేవరాజ్ బ్లేడ్‌తో మనోహర్ గొంతుపై దాడి చేశాడు. దీంతో అతనికి తీవ్ర గాయమై రక్తస్రావం అయ్యింది. గమనించిన స్థానికులు అతడిని 108 వాహనంలో ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. మనోహర్ కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెల్లడించారు.

ఫొటో ట్రేడ్ ఎక్స్‌పోను జయప్రదం చేయాలి



ఫొటోట్రేడ్ ఎక్స్‌పో -2023 వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న యూనియన్ సభ్యులు

దామెర: హైదరాబాద్ ఫొటోట్రేడ్ ఎక్స్‌పో -2023ను విజయవంతం చేయాలని ఫొటో అండ్ వీడియో గ్రాఫర్ల సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడు దామెర ప్రవీణ్ కుమార్ పిలుపునిచ్చారు. ఈ మేరకు మండల కేంద్రంలో శుక్రవారం వాల్‌పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రవీణ్ కుమార్ మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర అసోసియేషన్, ఫొటోటెక్ సంయుక్తంగా హైదరాబాద్ ఎల్‌బీ నగర్‌లోని కేబీఆర్ కన్వెన్షన్‌హాల్‌లో అక్టోబర్ 6 నుంచి 8 వరకు ఫొటో ట్రేడ్‌ఎక్స్‌పో కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫొటో మరియు వీడియో గ్రాఫర్లు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. మారుతున్న కాలానికి అనుగుణంగా నూతన టెక్నాలజీని ఉపయోగించి ఏ విధంగా ఫొటోగ్రఫీలో రాణించాలో తెలుసుకునేందుకు గొప్ప అవకాశమని అన్నారు. కోశాధికారి రమేష్, శ్రీనివాస్, కార్తీక్, ఆనంద్, నరేష్, అనిల్‌కుమార్, పవన్ పాల్గొన్నారు.

మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి రాజీనామా చేయాలి



నిరసన తెలుపుతున్న నాయకులు

హన్మకొండ: మహిళలను కాపాడలేని మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ తన పదవికి రాజీనామా చేయాలని విముక్త చిరుతల పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ జిలుకర శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఎంపీలో బాలికపై జరిగిన అత్యాచారాన్ని ఖండిస్తూ హనుమకొండలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద వీసీహెచ్‌పీ, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి మహిళలు, గిరిజనులు, దళితులు, బీసీలు, మైనార్టీలపై దాడులు పెరిగాయని ఆందోళన వ్యక్తం చేశారు. అంబేడ్కర్ యువజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మిద్దెపాక ఎల్లన్న, బీసీ స్టడీ ఫోరం అధ్యక్షుడు సాయిని నరేందర్, పీపుల్స్ డెమొక్రటిక్ మూవ్‌మెంట్ అధ్యక్షుడు సోమ రామ్మూర్తి, ప్రజా సంఘాల నాయకులు చుంచు రాజేందర్, గురిమిల్ల రాజు, రవీందర్, ఉదయ్ సింగ్, కొమురయ్య, నిరంజన్, శాగంటి మంజుల పాల్గొన్నారు.

పెంచిన వేతనాలను తక్షణమే అమలు చేయాలి

పరకాల: మధ్యాహ్న భోజన కార్మికులకు పెంచిన వేతనాలను తక్షణమే అందించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మంద శ్రీకాంత్ డిమాండ్ చేశారు. పట్టణంలో మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ అమరధామం నుంచి అంబేడ్కర్ కూడలి వరకు శుక్రవారం నిరసన ర్యాలీ చేపట్టారు. అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేసిన అనంతరం ఆయన మాట్లాడారు. వేతనాల పెంపుపై ముఖ్యమంత్రి కేసీఆర్ హామీ ఇచ్చి ఏడాది పూర్తయినా అమలు చేయకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. పెంచిన వేతనాలు అమలు చేయని యెడల మధ్యాహ్న భోజన కార్మికుల పక్షాన ఉద్యమాన్ని ఉధృతం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు బొచ్చు కల్యాణ్, పట్టణ నాయకులు మడికొండ ప్రశాంత్, మంద వికాస్, అక్రమ్‌తో పాటు మధ్యాహ్న భోజన కార్మికులు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న కార్మికులు

అంగన్‌వాడీల డిమాండ్లు పరిష్కరించాలి

వరంగల్: రాష్ట్రంలోని అంగన్‌వాడీ టీచర్లు, ఆయాల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని ఇఫ్టూ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆరెల్లి కృష్ణ, ఎం.శ్రీనివాసులు డిమాండ్ చేశారు. ఎల్‌బీనగర్‌లోని ఇఫ్టూ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ తమ డిమాండ్లు పరిష్కరించాలని నిరవధిక సమ్మెలో ఉంటూ వివిధ రూపాల్లో ఆందోళన సాగిస్తున్న అంగన్‌వాడీల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని వాపోయారు. కనీస వేతనాలు, ఉద్యోగాల రెగ్యులరైజేషన్, రిటైర్‌మెంట్ బెనిఫిట్స్, ఈఎస్ఐ, పీఎఫ్, ప్రమాద బీమా, ఇన్సూరెన్స్ వంటి సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఇఫ్టూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దయాకర్, అప్పారావు పాల్గొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు 19రోజులుగా, మధ్యాహ్న భోజన కార్మికులు 9, ఆశా వర్కర్లు 5రోజులుగా నిరవధికంగా చేస్తున్న సమ్మెలను ప్రభుత్వం వెంటనే విరమింపజేయాలని డిమాండ్ చేశారు.

నగరాభివృద్ధికి కట్టుబడి ఉన్నా..

హన్మకొండ: నగరాభివృద్ధికి కట్టుబడి ఉన్నానని ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్ అన్నారు. వరంగల్ పశ్చిమ నియోజకవర్గం పరిధిలోని 10వ డివిజన్‌లోని రాయపుర, పద్మాక్షి కాలనీలో సుమారు రూ.కోటి నిధులతో సీసీ రోడ్లు, డ్రెయినేజీ నిర్మాణ పనులకు శుక్రవారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో కుడా చైర్మన్ సంగంరెడ్డి సుందర్‌రాజ్, మాజీ డిప్యూటీ మేయర్ కాజాసిరాజుద్దీన్, స్థానిక కార్పొరేటర్ తోట వెంకటేశ్వర్లు, 7, 9వ డివిజన్ల కార్పొరేటర్లు వేముల శ్రీనివాస్, చీకటి శారద, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

కోవిడ్‌లో వైద్యుల సేవలు వెలకట్టలేనివి

ప్రపంచాన్ని అతలాకుతలం చేసిన కోవిడ్ సమయంలో వైద్యుల సేవలు వెలకట్టలేనివని ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్ అన్నారు. ప్రపంచ హృదయ దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రతిమ రిలీఫ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ ఆధ్వర్యంలో శుక్రవారం 3కే రన్ నిర్వహించారు. హనుమకొండలోని ములుగు క్రాస్‌రోడ్ నుంచి పబ్లిక్‌గార్డెన్ వరకు నిర్వహించిన రన్‌లో యువత, వైద్య సిబ్బంది పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. అంతకుముందు హనుమకొండ చౌరస్తాలో గుండె వ్యాధులపై అవగాహన కల్పిస్తూ వైద్య విద్యార్థులు ఫ్లాష్‌మాబ్ నిర్వహించారు. అనంతరం పబ్లిక్‌గార్డెన్‌లోని నేరెళ్ల వేణుమాధవ్ కళాప్రాంగణంలో రక్తదాన శిబిరంతో పాటు ఉచిత గుండె వైద్య శిబిరాన్ని నిర్వహించారు.



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న వినయ్‌భాస్కర్

అంగన్‌వాడీ సెంటర్‌లో పోషణ మాసం

మడికొండ: పోషణ మాసంలో భాగంగా మడికొండలోని రైతు వేదికలో డీడబ్ల్యూఓ మధురిమ అధ్యక్షతన శుక్రవారం కార్యక్రమం నిర్వహించారు. 64వ డివిజన్ కార్పొరేటర్ ఆవాల రాధికారెడ్డి పాల్గొని మాట్లాడారు. గర్భిణులు, బాలింతలు సమతుల ఆహారం తీసుకోవాలని సూచించారు. పౌష్టికాహారంతోనే తల్లి, బిడ్డలు ఆరోగ్యంగా ఉంటారని చెప్పారు. రీజనల్ సంచాలకులు జాన్సీ లక్ష్మిబాయి పాల్గొని గర్భిణులకు సామూహిక సీమంతం జరిపించారు. పిల్లలకు అన్న ప్రాసన, పప్పు దినుసులతో వంటకాలు, చేయించారు. ఆయుష్ ఆధ్వర్యంలో యోగా నిర్వహించారు. కేవీకే ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ రాజన్న, గృహ విజ్ఞాన శాస్త్రవేత్త డాక్టర్ అరుణ్‌జ్యోతి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ డీ.రాజ్యలక్ష్మి, కవిత, వీ.రాజ్యలక్ష్మి, సుమలత, కల్యాణి, స్వర్ణలత, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

పథకాలు పక్కాగా అమలు చేస్తాం

హసన్‌పర్తి: కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఆరు గ్యారంటీ కార్డులను పక్కాగా అమలు చేస్తామని కాంగ్రెస్ ఎస్సీ డిపార్ట్‌మెంట్ చైర్మన్, వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిగా దరఖాస్తు చేసుకున్న డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణ అన్నారు. హసన్‌పర్తి మండలం దేవన్నపేట, మడిపల్లి గ్రామాల్లో శుక్రవారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారంలోకి వచ్చాక ఇందిరమ్మ పథకం, మహిళలకు రూ.2500ల పింఛన్, ఆర్టీసీలో ఉచిత ప్రయాణం, రూ.500లకే గ్యాస్, యువతకు రూ.5లక్షలు, రైతులకు రూ.15వేలు, కౌలు రైతులకు రూ.12వేలు, ఉద్యమకారులకు ఇంటి స్థలం అందించనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో 65వ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాంరెడ్డి, మాజీ ఉప సర్పంచ్ సుధాకర్, బీసీ సెల్ అధ్యక్షుడు చేరాలు, మడిపల్లి సర్పంచ్ సునీత, విజయ, మహేందర్, చిన్న, నాగరాజు, భిక్షపతి, కట్టయ్య పాల్గొన్నారు.

పేదల అభివృద్ధి కోసమే కేసీఆర్ ఆరాటం

● ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి



చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే, తదితరులు

పరకాల: రాష్ట్రంలోని నిరుపేదలు అభివృద్ధి చెందాలని సీఎం కేసీఆర్ ఆరాటపడుతున్నారని ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి అన్నారు. కాంగ్రెస్, బీజేపీలు ఓట్ల కోసం రాజకీయం చేస్తే కేసీఆర్ ప్రజల బతుకుదెరువు, అభివృద్ధి కోసం ఆలోచిస్తున్నారని అన్నారు. పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మున్సిపాలిటీ, పరకాల, నడికూడ మండలాలోని వివిధ గ్రామాలకు చెందిన 133 మందికి కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు మంజూరు కాగా శుక్రవారం లబ్ధిదారులకు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వరాష్ట్రంలో కేసీఆర్ పరిపాలనలో అన్ని వర్గాల ప్రజలు సుభిక్షంగా ఉన్నారన్నారు. సుమారు రూ.1.3 కోట్ల చెక్కులు మంజూరు చేసిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. గతంలో కేంద్రంలో, రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉండగా, నేడు కేంద్రంలో బీజేపీ అధికారంలో ఉన్నా తెలంగాణ రాష్ట్రానికి ఒరుగబెట్టిందేమి లేదన్నారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలు దేశంలోని ఇతర రాష్ట్రాలకు స్ఫూర్తిగా నిలుస్తున్నామయన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ సోదా అనిత రామకృష్ణ, పరకాల, నడికూడ జెడ్పీటీసీలు సిలువేరు మొగిలి, కోడెపాక సుమలత, నడికూడ ఎంపీపీ అనసూర్య, రైతు సమన్వయ సమితి వరంగల్ జిల్లా కన్వీనర్ బొల్లె భిక్షపతి, మున్సిపల్ కౌన్సిలర్లు, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, అధికారులు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

సహకార సంఘం అభివృద్ధికి సహకరించాలి

ఎల్కతుర్తి: సహకార సంఘం అభివృద్ధికి ప్రతిఒక్కరూ సహకరించాలని సింగిల్‌విండో చైర్మన్ శ్రీపతి రవీందర్‌గౌడ్ కోరారు. విశాల సహకార సంఘంను లాభాల్లో నడిపిస్తూ బ్యాంక్ అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు పేర్కొన్నారు. మండల కేంద్రంలోని విశాల సహకార సంఘం ఆవరణంలో శుక్రవారం సొసైటీ సంఘం 69వ వార్షిక మహాసభ జరుగగా బ్యాంక్ సీఈఓ తిరుపతి సంఘం లావాదేవీల నివేదికను చదివి వినిపించారు. అనంతరం చైర్మన్ మాట్లాడుతూ పాలకవర్గ సభ్యుల సహకారంతో బ్యాంక్‌ను అభివృద్ధి పథంలో నడిపిస్తున్నట్లు తెలిపారు. సొసైటీలో మొత్తం 5,145 మంది సభ్యులను ఉన్నారని, బ్యాంక్‌లో మొత్తం రూ.1.40కోట్ల వాటాధనం ఉందన్నారు. 1108 మంది రైతులకు రుణాలు ఇచ్చామన్నారు. ఇప్పటి వరకు 618 మందికి రుణమాఫీ వర్తించిందని, రైతులకు సరిపడా యూరియా అందిస్తున్నామని అన్నారు. దసరా పండుగకు సొసైటీ ద్వారా రూ.60కే కిలో శనిగపప్పు అందిస్తామని వెల్లడించారు. ఈ సమావేశంలో ఎంపీపీ మేకల స్వప్న, వైస్ ఎంపీపీ తంగెడ నగేష్, సింగిల్‌విండో వైస్ చైర్మన్ మునిగడుప శేషగిరి, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు బూర్గుల రామారావు, సభ్యులు లోకిని సూరయ్య, వెంకట్రావ్, శ్రీనివాస్, ఐలయ్య, ముప్పు మహేందర్, ఎడవెల్లి సంధ్య, మేకల సమ్మక్క, రాజిరెడ్డి, మంతుర్తి సమ్మయ్య, కృష్ణమూర్తి, పోచయ్యతో పాటు రైతులు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న చైర్మన్ శ్రీపతి రవీందర్‌గౌడ్

చేనేత కార్మికులకు అండగా రాష్ట్ర ప్రభుత్వం



మాట్లాడుతున్న పీఏసీ చైర్మన్ శంకర్‌లింగం

శాయంపేట : చేనేత కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలుస్తూ సంక్షేమ పథకాలు ప్రవేశపెడుతోందని చేనేత సహకార సంఘం (పీఏసీ) చైర్మన్ మామిడి శంకర్‌లింగం అన్నారు. మండల కేంద్రంలోని చేనేత సహకార సంఘంలో శుక్రవారం 62 వ వార్షిక, 76వ అర్ధ సంవత్సర సాధారణ మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేనేత మిత్ర పథకం ద్వారా ప్రతీ చేనేత కార్మికుడికి రూ. 2వేలు, అనుబంధ కార్మికులకు రూ. వెయ్యి అందిస్తుందని తెలిపారు. చేనేత కార్మికుల చేనేత బీమాను 60 సంవత్సరాలను 65 సంవత్సరాలు పెంచడం సంతోషకరమన్నారు. ఆ సంఘం మాజీ అధ్యక్షుడు దిడ్డి రమేష్, పీఏసీ సభ్యులు రంగు ఆనందం, బూర లక్ష్మీనారాయణ, దిడ్డి ప్రభాకర్, మెండు సమ్మక్క, మత్స్యగిరి స్వామి ఆలయ చైర్మన్ సామల భిక్షపతి, కార్మికులు, సభ్యులు పాల్గొన్నారు.

భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలి

శాయంపేట : మండల కేంద్రంలో రజక సంఘం కమ్యూనిటీ భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని ఆ సంఘం నాయకులు కోరారు. ఈ మేరకు భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డిని శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందించి తమ సమస్యలను పరిష్కరించాలని కోరారు. రజక సంఘం కమ్యూనిటీ భవన నిర్మాణానికి నిధుల మంజూరు చేయాలని కోరగా స్పందించిన ఆయన రూ. 5లక్షలు, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య నిధుల నుంచి రూ. 5లక్షలు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. కమ్యూనిటీ భవన నిర్మాణ పనులకు ఆదివారం శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు. అడిగిన వెంటనే నిధులు మంజూరు చేసిన ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్యకు రజక సంఘం నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. ఎంపీటీసీ బాసాని చంద్రప్రకాష్, రజక సంఘం నాయకులు నడిగొట్టు సాంబయ్య, పైండ్ల రమేష్, కొత్తపెల్లి రవి ఎమ్మెల్యేను కలిసిన వారిలో ఉన్నారు.



ఎమ్మెల్యేను కలిసిన రజక సంఘం నాయకులు

హక్కుల సాధనకు ముదిరాజ్‌లు ఏకంకావాలి



మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్

దామెర: హక్కుల సాధనకు ముదిరాజులందరూ ఏకంకావాలని ముదిరాజ్ ఎంప్లాయిస్ అండ్ ప్రొఫెషనల్ అసోసియేషన్(మెపా) రాష్ట్ర అధ్యక్షుడు కొత్తగట్టు శ్రీనివాస్ అన్నారు. అక్టోబర్ 1వ తేదీన పరకాల పట్టణంలో నిర్వహించనున్న ముదిరాజ్ జాతి హక్కుల సాధన ర్యాలీని జయప్రదం చేయాలని కోరుతూ మండలంలో శుక్రవారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో అధిక సంఖ్యలో ముదిరాజ్‌లు ఉన్నారని, వారిని రాజకీయంగా అణగదొక్కుతున్నారని అన్నారు. రానున్న ఎన్నికల్లో ముదిరాజ్‌లకు ఎక్కువ సీట్లు కేటాయించి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర నాయకుడు మాలిక్ రమేష్, వరంగల్ జిల్లా అధ్యక్షుడు అభినాష్, జిల్లా ప్రధాన కార్యదర్శి పెండ్యాల కృష్ణ, ఉపాధ్యక్షుడు పిట్టల రాజు, పులి సదానందం, సంయుక్త కార్యదర్శి కొమ్ము ప్రభాకర్, మండల అధ్యక్షుడు తక్కళ్ల నరేష్, ప్రతాప్, విజయ్. పిట్టల రమేష్, అరవింద్, రాజు, మధు, సార రాజేష్, కిషోర్, పిట్టల కిషోర్, బండి రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
వరంగల్ అర్బన్:
9951602875 | 9505507575
9010299096 | 9553955722
Office mail : wglsakshiadvt@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
ఎస్. కల్యాణ్ (S.R) : 8686236437 (ఎల్కతుర్తి)
కె. సుధాకర్ (A.C.O) : 9177258410 (హన్మకొండ)